


ఆదివారం – రాత్రి.

గడియారం వరసగా పదీ, పదకొండూ, పన్నెండూ కొట్టడం లెక్కపెడుతూ విన్నాను, వింటూనే లెక్కపెట్టాను.

ఒంటిగంటమటుకు ఎప్పుడుకొట్టిందో తెలీలేదు.

ఆ సాయంకాలం, అప్పుడప్పుడే చీకట్లు కమ్ముతున్న సంధ్యాసమయంలో, విద్యుద్దీపాలతో తళుక్కుమని మెరిసిపోయే బజారు వీధుల్లోకి బయల్దేరుదామనుకుంటూండగా, తీరిగ్గా, సోఫాలో, జేరబడిఉన్న అన్నయ్య, వెర్రి ప్రశ్న వేశాడు.

"బజారుకేనా?" అని. నేను మౌనం వహించాను. తిరిగి అన్నయ్యే అన్నాడు. "ఒక్కనిమిషం కూచోరా, నీతో మాట్లాడాలి."

నేను కూర్చోవడానికి తటపటాయించాను. అన్నయ్య సోది మొదలెడతాడు. దేశ ఆర్థిక పరిస్థితి, కుటుంబ ఆర్థిక పరిస్థితి; పొదుపు; మొరార్జీని తప్పుకో

మని, అన్నయ్యను ఆర్థికమంత్రిగా చేస్తే ఎంత బాగుండునూ అనిపిస్తుంది. తమలపాకులు నములుతూ, ఉపన్యాస ధోరణిలో అందమయిన సాయంకాలాలను హతమార్చడం అన్నయ్యకు పరిపాటే. ఈ సాయంకాలపు అందాల్ని అనుభవించి తీరాలి. అన్నయ్యబారి నుంచి తప్పించుకోవాలి. పనుందని అబద్ధం చెప్పి జారుకుందామనుకున్నాను. అన్నయ్య సర్వజ్ఞుడు. ఆదివారాల్లో, అందముందనీ, అందాలను సాయంకాలాలు పూసుకుంటాయనీ, నాకూ తెలిసిందంటే దానిక్కారణం అన్నయ్యే.

అయిదేళ్ళ క్రిందట అన్నయ్యకోసం ఆదివారాలు అందాలవి పూసుకున్నాయి. సూర్యుడి కిరణాలకు బంగారు వెలుగుల్నీ, చంద్రుడి కిరణాలకు వెండి వెలుగుల్నీ, ఆకాశంలో చుక్కలకి జిలుగు వెలుగుల్నీ, మావదినే ప్రసాదిస్తుందని అన్నయ్య అభిప్రాయం. సాయంకాలపు టందాలు చీకట్లో చెరిగిపోకముందే, అన్నయ్య బయలుదేరేవాడు వదినకోసం. అప్పటికింకా, వదిన పూర్తిగా మాకు వదినకాలేదులెండి.

నాలో చెలరేగుతున్న భావవైపరీత్యం గ్రహించింది కాబోలు "ఓ నిమిషం కూర్చో మరదీ! నీగురించే మాట్లాడుతున్నాం" అంది వదిన తమలపాకులు చుడుతూ. నాగురించి వీళ్ళేం మాట్లాడుకుంటున్నారో నాకుతెలుసు. నన్ను రోజూ ఓమారు... పెళ్ళికొడుకును చేస్తారు. అరడజను అమ్మాయిల్ని, వాళ్ళ అత్యుత్తమ సౌందర్యాది గుణగణాలను, అద్భుతంగా, వాళ్ళిచ్చే కట్నాలరేటు ప్రకారం వర్ణించిచెప్పి, వీళ్ళలో ఎవర్నో ఒకర్ని పెళ్ళాంగాచేసుకుని, ఆదివారాలనీ, సాయంకాలాల్నీ అందంగాఇంట్లోనే భద్రపరుచుకోవోయ్ అని 'గీ' పెడతారు. వీళ్ళల్లో నాకెవరూ నచ్చరు. నాకు నచ్చిన వాళ్ళని మాత్రమే చూపించమనడం సాధ్య మెలాగవుతుంది.

"డబ్బుకొద్దీ నాణ్యం. రేటెక్కడ ఎక్కువుంటే ఆ అమ్మాయికే మొగుడివయిపో మరిదీ!" అంటుంది దమ్మిడీ కట్నంలేకుండా సాయంకాలాల్లో అందాల్ని చూపించి ఆదర్శంగా పెళ్ళి చేసుకున్న వదిన, నర్మగర్భంగా.

వీళ్ళు నన్ను మరీ అమాయకుడ్ని చేసి వేళాకోళం చేస్తున్నారేమో ననిపిస్తుంది. వీళ్ళకు మరీ చులకనయి పోకూడదు. నేమాత్రం తక్కువ తిన్నానా? నేనూ ప్రేమించే పెళ్ళిచేసుకుంటాను. అమాట కొస్తే చాలాభాగం అప్పుడే ప్రేమించేసేసాను కూడానూ! నన్ను కూడా ప్రేమించేస్తూనే ఉంది ఉండాలి విజయ ఈపాటికి. నాలో కరువయిందేమిటని? కాకపోతే, సూటిగా విజయవేపు చూడలేనంతే! భయంచేతకాదు. ఇంకా నాలో సభ్యత చావలేదు ప్రేమ గౌరవమయిందనీ, గౌరవంగా ప్రేమించాలనీ,

నా అభిప్రాయం.. అంతేకాని "నిన్ను ప్రేమించేస్తున్నాను విజ్జీ" అని ఏబస్సు క్యూలోనో, గుళ్ళో క్యూలోనో అనేసి, "సారీ బ్రదర్" అనిపించుకొని ప్రేమ నగౌరవపరచడం ఏం బాగుంటుందని.

"కూర్చోరా" రెట్టించాడన్నయ్య.

"లేదన్నయ్యా. ఇప్పట్లో నాపెళ్ళి గురించి త్వరపడకండి."

"పెళ్ళివిషయం కాదురా, నువ్వునన్ను చెప్పనియ్యవేం. ముందు కూర్చో."

అసలు విషయమేమిటో అర్థమవడం లేదు. సోఫాలో చేరగిలబడి తన్మయంగా జర్దాపాన్ నములుతూ అన్నయ్యాదిగాడు.

"మా సెక్షనులో పనిచేసే విజయ నీకు తెలుసా?"

"తెలుసు"

"ఎలా తెలుసు?"

అసలు తెలీదు.

"అంటే, చూళ్లేదా మాటాడ్లేదా" అన్నయ్య నవ్వుతున్నాడు

"మీసెక్షనులో పనిచేస్తుందనే తెలుసు, అంతేకాని ఆవిడ నాకేమంత బాగా తెలీదు." ఇబ్బందిగా ఉంది పరిస్థితి.

"పోనీ, ఆవిడగురించి నీ అభిప్రాయం"

"నాకా అభిప్రాయం! నాకెందుకూ..." తడబడ్డాను. మొహమాట పడ్డాను. విజ మొప్పుకోలేని పిరికితన మేదో నన్నావహిస్తోంది. విజయగురించి, నాక్కాక పోతే, మరెవడి కుంటుంది అభిప్రాయం. విజ్జీనాది. నేనెంత గౌరవంగా ప్రేమిస్తున్నానవీ...

"ఇవాళ విజయ మవింటికొస్తోంది" చల్లగా అనేసి కొంటెగా నవ్వుతోంది వదిన నన్ను వేళాకోళం పట్టిస్తూ. విస్మయంగా అన్నయ్యవేపు చూశాను.

"అవున్రా. ఆశ్చర్య పోతావేం. మొన్న వాళ్ళింట్లో పార్టీ ఏర్పాటు చేసింది మొదటి 'సాలరీ'గా తీసుకుంది; అందుకూ; అప్పుడందిలే మీ శ్రీమతి నెప్పుడు చూపిస్తారూ అని; ఉత్తినే అన్నా, ఆదివారం సాయంకాలం మా ఇంటికీరండి మా శ్రీమతిని చూసినట్లూ వుంటుంది; మా ఆతిథ్యం పొందినట్లూ ఉంటుందని. వెంటనే ఒప్పేసుకుంది".

"విజంగానా!" ఆశ్చర్యం, ఆనందం, సందేహం, మెదళ్ళో గందరగోళం, ప్రారంభమయింది. వెర్రిగా జుత్తు పీక్కున్నాను. వదిన టాపులేచిపోయేలా నవ్వుతోంది. నోట్లోని తాంబూలం క్రింద పడకుండా అవస్థ పడుతూ, అన్నయ్యా నవ్వుతున్నాడు

పీళ్ళ వేళాకోళం భరించలేక పోతున్నాను నన్ను పసివాడికింద జమ కట్టేసి అమాయకుడ్నిచేసి ఏడిపిస్తున్నారు. నాలో ఉక్రోషం పెల్లుబుకుతున్నది.

"మీరిచ్చే టోడికాఫీకోసం విజయ మవింటికేంరాదు. మీరు నన్నుడికించటం కోసం, అంటున్నారంతే" విసురుగా అనేశాను.

"నువ్వు తుకోక్కవడం దేనికోయ్. ఏం, నువ్వేమన్నా విజయని ప్రేమిస్తు న్నావా ?" అన్నయ్య విపరీతంగా నవ్వు తున్నాడు.

"ఏం ? ప్రేమించకూడదా ? నీకు సదానందం చెప్పేసుంటాడు." నోరు జారాను. దొరికిపోయాను. అన్నయ్య మళ్ళా నోరువిప్పకముందే బయట పడదామని వీధి వరండాలోకి పరిగెత్తి దిగ్భ్రమచెందిన గావుకేక పెట్టినంత పని చేశాను. గేటుముందాగిన రిక్షాలోంచి అందంగా దిగడానికి అవస్థ పడుతోంది విజయ.

విజయ రావడం కిటికీలోంచి చూశాడు కాబోలు; వరండాలోకి వచ్చి, నావేపు సగర్వంగా ఓ చూపు పారేశా డన్నయ్య. విజయ గేటుతీసుకుని లోపలి కొస్తోంది. నాగుండెలు వేగంగా స్పంది స్తున్నాయి. ఆనందం పట్టలేక పోతు న్నాను. ఆశ్చర్యం చంపుకోలేక పోతు న్నాను. ఏం చేయాలో తోచని అయో మయ పరిస్థితి. భరించలేని ఆనందంలో అనాలోచితంగా వంటింట్లోకి పరిగెత్తాను. మరికొన్ని క్షణాల తరువాత వదిన వచ్చింది

"ఏంమరిదీ ! మరీఇంత ఇదయితే పనికిరాదుసుమా ! ఇప్పట్నుంచే నువ్వు కాఫీకాచడం మొదలిడితే రేపు తను వంటిల్లు పట్టించుకోదయ్యా..."

వదిన వేళాకోళంచేసినా బాధనిపించ లేదు. మనసంతా మధురమయిన భావనతో నిండిపోయింది.

''అదికాదు వదినా మీ రా వి డతో మాటల్లోపడి మరచిపోతా రేమోనని..."

"నే మరచినా నువ్వూరుకుంటావా మహానుభావా!'' అయినా అవిడక్క డుంటే నువ్వొచ్చేస్తే ఎలా ? నేకాఫీలు తెస్తాగాని, నువ్వెళ్ళి కబుర్లు చెబుతూ వుండు."

'నువ్వు తోడురా వదినా' అందా మనుకున్నాను. ఒంటరిగా విజయముందు కెళ్ళడానికి బిడియపడ్డాను.

"ఏం మగమహారాజువయ్యా ! వెళ్ళ మంటుంటే" వదిన అందంగా కసిరింది.

పెద్ద పనున్నవాడిలా మొహంపెట్టి, సీరియస్‌గా బజార్లోకి దాటేస్తున్న నన్ను అన్నయ్యడ్డేశాడు,

"అతిథు లింట్లోకొస్తే, అలా వెళ్ళి పోతావేం, చూడు ఎవరొచ్చారో...

"తమలపాకులు లేవంటే తెద్దామని." మాట మధ్యలో మింగేసి, నన్ను చూసి, సిగ్గుగా నమస్కరించిన విజయను పూర్తిగా చూళ్ళేక సిగ్గుపడుతూ ప్రతి నమస్కారం చేశాను.

"మీ ఉద్దేశ్యం, తమలపాకుబీడాలా?" టీపాయ్ మీదనున్న విడి తమలపాకుల వేపు చూస్తూ భావగర్భితంగా మంద హాసం చేసింది విజయ.

"మీరు భలేవారేనే'' అన్నాను నవ్వుతూ. నాకోవి బిడియం పటాపంచ లయింది.



తనుకూడా ఆపాదమస్తకం అందంగా ఊగిపోతూ నవ్వుతోంది. అందంగా కదులుతున్న విజయనీ విజయలో కదులుతున్న అందాన్నీ చూస్తూ కూర్చున్నాను. క్షమాపణ ద్యోతకమయ్యేలా మొహంపెట్టి "ఇప్పుడే వస్తా, మాట్లాడుతూ ఉండండి" అని అన్నయ్య లోపలికెళ్ళాడు. నవ్వునుంచి తేరుకుని, చీరకొంగును నిండుగా కప్పుకొని, పొందిగ్గా కూర్చుంది విజయ. ఎర్రటి చీరా అదేరంగు రవికా, నుదుటి మీద ఎర్రని తిలకం, మా తోటలో ఉషస్సులో వికసించే ముద్దమందారంలా ఉంది విజయ. అందాన్ని, ఆకర్షణీయ తనూ తనదిగా చేసుకున్న విజయను, కళ్ళల్లో నింపుకుంటున్నాను. ఇంతలో వదిన మంచినీళ్ళూ కాఫీ కప్పులూ తీసుకువచ్చి టీపాయ్‌మీద ఉంచి, 'స్టౌ ఆర్పివస్తా'నంటూ లోపలికెళ్ళింది. అరుదైన ఏకాంతం, అందమయిన నిశ్శబ్దం, బరువుగా వాలిపోతున్న చూపులూ, ఆరాటపడుతున్న పడుచు హృదయాల వేడి నిశ్వాసాలూ. ఉత్తినే కూచోవడం సభ్యత కాదని "కాఫీ తీసుకోండి" అన్నాను అతిప్రయత్నంమీద.

మంచినీళ్ళ గ్లాసుని చేతిలోకి తీసుకుంటూ అంది విజయ.

''మీ రేమయినా కబుర్లు చెప్పండి.''

"ఏం మాట్లాడమంటారు. మీరు మా యింటికొచ్చారు. క్రొత్త వెలుగుల్ని తెచ్చారు. అంతకన్నా అదృష్ట మేమి టుంటుంది చెప్పండి. మీ ముందు నేను మూగివాడి నయిపోతున్నాను." ఉత్సాహం గట్లు తెంచుకొని ప్రవహిస్తోంది. మంచినీళ్ళు త్రాగడం ఆపి, ఆశ్చర్యంగా చూస్తూ, కళ్ళని చక్రాల్లా త్రిప్పి "మీరు మా బాగా పొగుడుతారే" అని త్రుళ్ళి త్రుళ్ళి నవ్వుతూ, అనాలోచితంగా, మంచినీళ్ళని మీద ఒంచేసుకుంది. తడిసిన ఎర్రటి పవిట ఎదపొంపును ఎగదోస్తోంది. వర్షఋతువులో కనిపించే ఆరుద్ర పురుగురంగు గుండెలు. ఆకులేని మోదుగు వృక్షం మీద, గ్రీష్మంలో కాకలెత్తే పూమంటల్లాంటి గుండెలు. నన్నావహిస్తున్న ఆవేశాన్ని వివేకం అడ్డుకుంటున్నది.

"అరెరె తడిసిపోయారే. నీళ్లలికి పోయాయా?" పరామర్శిస్తూ వదినా. అన్నయ్యా ఒకరివెంట ఒకరుగా గదిలో కొచ్చారు.

"ఫరవాలేదు లెండి" నిర్లిప్తంగా అంది విజయ.

"కాఫీ తీసుకోండి, వేడెక్కుతారు; తడిసిపోయారుకూడా," వదిన చమత్కరించింది.

"థ్యాంక్స్, మీ అభిమానానికి. మీ మరిదిగారి కంతమాత్రమయినా తట్ట లేదు" కొంచెం సీరియస్‌గా అంది విజయ.


విజయట్లాఎందుకన్నదో ఆలోచన కంద లేదు. విస్తుపోయాను. నానుంచేదో పొరపాటు జరిగినట్టుగా ఫీలయ్యాను.

"అది మరిది దోషం కాదులెండి. కొందరి సమక్షంలో ఉండే ప్రభావం" వదిన నర్మగర్భంగా నవ్వింది. విజయ సిగ్గుపడిపోయింది. సిగ్గుతో నిగ్గుదేరిన విజయ చెక్కిళ్ళని చూసింతర్వాతకాని మనసు కుదుటపడలేదు.

పెదాలను రేఖామాత్రంగా విప్పి కాఫీ కప్పును, అందమయిన పెదాలకు కందించబోతోంది విజయ. అంత అందమయిన, నాజూకైన పెదాలు, కాఫీ వేడికి కరిగిపోతాయేమో ననిపించింది.

కాఫీలయిన, మరికొంత సేపటికి విజయ వెళ్తానంది. అప్పుడే వీధిలో దీపాలు వెలిగించి, చాలా సేపయింది.

"బంకుదాకా వెళ్ళి రిక్షా ఎక్కించి రారా" అన్నాడన్నయ్య. విజయా నేనూ బయలుదేరాం. కనుచూపు మేరలో రిక్షా ఏదీ కనిపించలేదు. ఊరికి దూరంగా పారేసినట్టుగా ఉంది మా కాలనీ. నిర్మానుష్యమయిన రోడ్డు, చీకటుందిసుమా అని జ్ఞాపకం చేయడంకోసం, డ్యూటీగా వెలుగుతున్న మసకదీపాలు, గిలిగింతలు పెడుతున్న చల్లటి ఈదరగాలి విజయా నేనూ మాకు తెలియకుండానే, సన్నిహితంగా ప్రక్కప్రక్కనే నడుస్తున్నాం. విజయ ప్రక్కన నడుస్తున్నందుకు, నాకు చాలా గర్వంగా ఉంది.



"మీరు కొంచెం గర్విష్ఠులనుకుంటాను" ఉన్నఫళంగా విజయ అనేసింది.

"నాకా గర్వం," ఆశ్చర్యపోయాను.

"అవును వచ్చిం దగ్గర్నుంచి చూస్తున్నాను. నే వాగడం తప్పిస్తే మీరేమయినా మాట్లాడేరా?" విజయ నిష్ఠూరంగా అంది.

"ఈ మాటే నే నంటే? నే నన్న వాణ్ణి ఒహాడి నున్నాననయినా గమనించకుండా మీరన్నయ్యతోనూ వదినతోనూ మాట్లాడుతూ కూర్చుంటే నే నేం చేసేది. అసలు నే నంటే మీ కభిమానముంటే కదా."

"అవును. అభిమానం లేకపోవడం చేతే, ఇంత దూరం, ఊరిబయటకు మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను." విజయ సాధిస్తున్నట్టుగా అంది. గొంతు బొంగురుపోయింది. నన్ను నేను నమ్మలేక పోతున్నాను. విజయ నిజంగా నా కోసమే వచ్చిందా. ఇన్నాళ్ళూ విజయ నర్థం చేసుకోలేకపోయినందుకు నా మీద నాకే విసుగొచ్చింది.

"నీకు తెలీదు విజయా! నువ్వంటే నా కెంత అభిమానమో" నా కళ్ళు చెమర్చాయి.

"అంతా అబద్ధం. అంత ఇదేవున్న వారయితే మా సెక్షనులోంచి వెడుతూ కూడా నన్ను గమనించకుండా, నిర్ల

క్ష్యంగా చూసీ చూడనట్టుగా ఎందుకు వెళ్ళిపోయేవారు...? దూరంగా ఆ మూల సీట్లో కూర్చుని, ఠీవిగా, సదానందంతో కబుర్లుచెబుతూ ఉంటారుగానీ, ఏనాడయినా, క్రొత్తగా చేరానుకదానన్న జాలితోనయినా, మీ పని కష్టంగావుందా, ఎడ్జస్టవగలుగుతున్నారా అని అడిగారా.'' విజయలోని ఉద్వేగం, దుఃఖంగా మారి గొంతు జీరపోయింది. నేను పూర్తిగా కదిలిపోయాను. ''విజ్జీ!'' విజయ మరీ సన్నిహితంగా నడుస్తున్నది. భుజాలు ఒరుసుకుంటున్నాయి. విజయ చేతి వ్రేళ్ళని నా చేతి వేళ్ళతో అల్లి ఆవేశంగా నొక్కాను. విజయ పూర్తిగా నా మీద కొరిగి నడుస్తున్నది. బరువుగా అడుగులు వేస్తున్నాం.

"నీ కోసం, నేను తపించని రోజు లేదు విజ్జీ! దూరంగా ఉండి నన్నిలా దహిస్తున్నందుకు నీ మీద ఎంత కసిగా ఉండేదనీ, నీతో మాట్లాడే అవకాశం ఎలా కల్పించుకోవాలో తెలియక ఎలా అవస్త పడేవాడ్ననీ. నీతో మాట్లాడలేక, మాట్లాడకుండా ఉండలేక నేను పడ్డ వ్యధ నీ కర్థం కాదు. నీ సాక్షిగా విజ్జీ నువ్వు లేని నేను లేను."


''నేను ధన్యని'' బరువుగా నిట్టూర్చి తలని నా భుజంమీద వాల్చేసింది.

చిక్కటి చీకటి, చక్కటి తారురోడ్డు; స్వేచ్ఛగా మే మిద్దరం. మాలో అనంతమయిన కోరికలు. విజయను బలంగా హత్తుకుందామనుకున్న కోరికను బలంగా అణుచుకున్నాను.

దైవికంగా అటుగా ఓ రిక్షావచ్చింది. తనతోకూడా రమ్మని విజయ మారాం చేసింది. "గౌరవంగానువ్వు నాకౌగిలిలోకి వచ్చేరోజుకౌర కెదురు చూడు విజ్జీ" విజయకళ్ళల్లోకి నవ్వుతూ అన్నాను. రిక్షాలోకూర్చుని నాచేయి నందుకుని ముద్దుపెట్టుకుంది. రిక్షా సాగిపోతూనే వుంది. కదులుతున్న రిక్షాలోంచి చేయి వూపుతున్నది విజయ. చెమర్చిన కళ్ళతో రిక్షా కనుమరుగయ్యే దాకా, చిక్కటి చీకటి. చీకట్లో ఒంటరిగా నేనూ...

*   *   *

సోమవారం ఉదయం సదానందం సీటుదగ్గర కూర్చుని రాత్రివచ్చిన అందమైన కల నెమరు వేసుకుంటున్నాను. విజయ, తతిమ్మా అమ్మాయిలూ వాళ్ళ పనులేవో చూసుకుంటున్నారు. సదానందం ఆతృతగా అడిగాడు. "ఎందాకా వచ్చింది బ్రదర్ వ్యవహారం. విజయ నీకు మంచిజోడి, నువ్వే దక్కించుకోవాలి. మరినేను రాత్రి కలగన్నా. అబ్బ! ఎంత అందమయిన కల; నువ్వూ నేనూ గుడిముందుగా వెళ్ళుతున్నాం. పట్టుచీరలో ప్రసాదంతో విజయ గుళ్ళోంచి సరాసరి మనముందు కొచ్చింది. నిన్ను పేరెట్టి పిలిచి ప్రసాదం నీచేతిలో వుంచింది. అదృష్టమంటే నీది బ్రదర్," విజయ నాకోసం మాత్రమే




పుట్టినట్టు మాట్లాడతాడు సదానందం, అమాయకంగా. విజయకు కనిపించేలా నిటారుగా కూర్చున్నాను. విజయ నావేపు చూసింది. నిర్వికారమయిన ఆ కళ్ళ లోతులవెనుక భావాలకోసం అన్వేషిస్తున్నాను. కనురెప్పలు బరువుగా దించేసి పనిలో మునిగిపోయింది.

విజయ మనోభావాలను మొహంలో పట్టేయడం చాలా కష్టంగా వుంది. దరహాసరేఖలు లీలామాత్రంగా కనిపిస్తున్నాయనుకున్న ఉత్తర క్షణంలోనే చాలా గంభీరంగా కనిపిస్తుంది విజయ. ముందురోజుల్లో విజయ నవ్వేది. బయలుగా నవ్వడానికి బిడియపడేవాణ్ణి. నన్ను చూసే నవ్విందా అని అనుమానం కలిగేది. పలకరింపుగా చిరునవ్వు నవ్వితే సభ్యత కాదేమోనన్న సంకోచం, పరిచయంకోసం పాకులాడుతున్నానని చులకనభావం వహిస్తుందేమోనని జంకు నన్ను వెనక్కిలాగేవి. నాకో విషయం రూఢిగా తెలుసు. విజయ నావేపునే గమనించకుండా చూడ్డానికి చాలా ప్రయత్నించేది. "ఆ అమ్మాయికి నీమీద మనసుంది. లేకపోతే నీవేపెందుకలా గాఢంగా చూస్తుంది" అనేవాడు సదానందం. సదానందం భ్రమపడ్డాడని నేననుకోను. ఒక్కోసారి అనిపించేది. విజయ నన్ను ప్రేమిస్తోంది. లేకపోతే నేను కనిపించగానే చిరునవ్వు లెందుకు చిలికించేది? అటుగా వెళుతున్న నావైపు ఎందుకలా కళ్ళార్పకుండా చూసేది? కాని మరి, నేనంటే ఎందుకు నిరసనగా ఉంటోంది ఈమధ్య? ప్రేమవల్ల కలిగిన గారాబపు అలుకకావచ్చు. నన్ను పలకరించడేం అన్న విసుగు కావచ్చు. పాపం పరితప్తహృదయ ప్రేమావేశాన్ని నిరసనగా ప్రదర్శిస్తోంది.

విజయ నన్నెందుకు ప్రేమిస్తోందీ?

రోజూ నేనక్కడ తారాట్లాడడం చూసి నిరసనభావం వహించి ఉండవచ్చు. లేక నేను తనవేపలా గాఢంగా చూడడం, నలుగురూ గమనించి గేలిచేస్తారేమోనని విసుగుచెంది ఉండవచ్చు. నలుగురూ ఏమన్నా అనుకుంటారనే బాధే అయితే, విజయ నన్ను ప్రేమించినట్టేనా? నాకు నవ్వొచ్చింది. నా సందేహాలకు జవాబులు నాదగ్గరలేవు. నన్ను నేను ప్రశ్నించుకోవడం మాత్రమే నేను చేయగల్గింది. చీకట్లో నిలుచున్నాను. వెలుగును వెతుక్కుంటున్నాను. వెలుగుకనిపిస్తే భరించగలనా అని సందేహం. వొద్దు, వెలుగు నాకక్కర్లేదు చీకటే హాయిగా ఉంది. అనుభూతుల్ని మిగుల్చుకోవచ్చు. ఆ వారం రాత్రి చీకట్లో బంగారపు వెలుగుల కల మనస్సులో నిండిపోయింది. విజయ చేతిలో నాచేయి. చుట్టూ చీకటి, మృదువుగా నాచేతిని విజయ పెదాలతో స్పృశించడం. నీకోసమే నన్ను నేను, నీవే నా సర్వస్వమన్న విజయ. కలలో ఎంత ఉదాత్తంగా పెరిగిపోయాను. నాకెంత ధైర్యమని! విజయ కళ్ళలో కళ్ళుచేర్చి ఎంత ధీమాగా ఆమె సౌందర్యాన్ని అవలోకించానని. చుట్టూ చీకటి, బంగారుకల. ఈకల చీకట్లోపుట్టింది. ఇందులో వెలుగుందా? ఏమోమరి? ఏదయినా అందమయిన బంగారుకల. అందమయిన చక్కటి చిక్కటి చీకటికి అందాలనిచ్చేకల. అందమయిన చీకటి, అందమయిన చిన్నవాడు. నాపరిస్థితికి నాకే నవ్వొచ్చింది. 'ఏమి'టన్నాడు సదానందం కుతూహలంగా.

"ఆఅమ్మాయికి నేనంటేఅసహ్యం." నిర్విచారంగా అన్నాను.

"ఏం, ఎందుకని" దెబ్బతిన్న వాడిలా అడిగాడు సదానందం.

"ఏమో తనే చెప్పింది" అబద్ధమాడాను. సరదాగాఉంది.

"అంతగర్వమా, తనేపెద్ద అందగత్తా, పోనీలే బ్రదర్ 'వర్రీ' అవకు. ఇంతకన్నా మంచివాళ్ళనే చేసుకుందువుగాని, నీకోసం ఎంతమందనిరారు?" విన్నటిదాకా విజయ అందాన్ని పొగిడిన సదానందం మొహం ఇవ్వాళ మరీ నల్లగా కనిపిస్తోంది. చిక్కటి చీకటిలాంటి అయోమయం. అందులోనే మిణుగురు పురుగుల్లాంటి ఆశల వెలుగును సందేహాలు మలిపేస్తున్నాయి. ఈచీకటి నన్ను ఎగతాళి చేస్తోంది. ఓదారుస్తోంది. బంగారపు కలల్ని పండించి, నన్ను కలల్లో బ్రతికిస్తోంది. నా ఆలోచనలకి నాకే నవ్వొచ్చింది. ఈమారు విపరీతంగా నవ్వాను. తనేదో ఓడిపోయిన వాడిలా బాధపడుతున్న సదానందాన్ని చూసి నవ్వుతున్నాను. అర్థంకాక బిత్తరపోయి నావేపు కళ్ళప్పగించిచూస్తున్న విజయని చూసి నవ్వుతున్నాను. కసిగా, ఆనందంగా, నవ్వుతున్నాను. తెరలు తెరలుగా నవ్వుతున్నాను. ఇప్పుడు విజయ నవ్వుతోంది; సదానందం నవ్వుతున్నాడు. నిర్భయంగా విజయవేపు చూస్తూ నవ్వుతున్నాను. చీకట్లో వెలుగుల్ని వెతుక్కున్న గ్రుడ్డివాణ్ణి నవ్వుతున్నాను.